సాక్షి నంద్యాల

బుధవారం, 22, నవంబర్, 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్న, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించి ప్రత్యేక నైవేధ్యాన్ని సమర్పించారు.



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా డ్యాంలో 1.152 టీఎంసీల నీరు ఉంది.



వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో నేటి నుంచి ఈనెల 26వ తేది వరకు చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని బనవాసి కేవీకే శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

పది, ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్మిషన్లకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏఓఎస్ఎస్) ద్వారా 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన పది, ఇంట ర్ తరగతుల్లో అడ్మిషన్లు పొందడానికి ఏపీఓఎస్ఎస్ సంచాలకులు ఈనెల 26వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం చెల్లించకుండా దర ఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందన్నారు. వివరాలకు www.apopen school.ap. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ పంచ శైవ క్షేత్ర దర్శిని యాత్ర సర్వీసు ఏర్పాటు

నంద్యాల టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రముఖమైన ఐదు శైవ క్షేత్రాలను భక్తులు సందర్శించేలా పంచ శైవ క్షేత్ర దర్శిని పేరుతో స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డీఎం గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడు తూ ఈనెల 26వ తేదీ కార్తీక పౌర్ణమి, 27వ తేదీ కార్తీక సోమవారం, డిసెంబర్ 4 తేదీ సోమవారం రోజుల్లో నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 6 గంటలకు ఈ బస్సు సర్వీసు ప్రారంభం అవుతుందన్నారు. పంచ శైవ క్షేత్ర దర్శిని యాత్రలో భాగంగా ఈ సర్వీసు మహానంది, ఓంకారం భోగేశ్వరం, యాగంటి, కాల్వబుగ్గ క్షేత్రాల సందర్శన అనంతరం తిరిగి నంద్యాలకు చేరుకుంటుందన్నా రు. చార్జీ పెద్దలకు రూ.450, పిల్లలకు రూ.235 గా టికెట్టు ధర నిర్ణయించినట్టు తెలియజేశారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

3న జాతీయ ఉపకార వేతన పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): 2023–24 విద్యాసంవత్సరానికి జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) డిసెంబర్ 3వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయాల వెబ్‌సైట్ www.bse. ap. gov. in నందు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల యుడీఐఎస్ఈ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాల విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి అందజేయాలన్నారు.

రేపు డీసీసీబీ బోర్డు సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డు సమావేశం గురువారం నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నారు. సమావేశంలో పాలకవర్గం సభ్యులతో పాటు ఆప్కో అధికారులు, జిల్లా సహకార అధికారులు పాల్గొంటారు.

సామాజిక గౌరవం.. సంక్షేమ ఫలం

- అణగారిన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట
- పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమన్యాయం
- నాలుగున్నరేళ్లుగా విస్తృతంగా సంక్షేమ పథకాల అమలు
- నేడు బనగానపల్లెకు సామాజిక సాధికార బస్సు యాత్ర
- చేసిన మేలును వివరించనున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి పెద్ద పీట వేసి సముచిత పదవులు ఇచ్చి గౌరవించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న విప్లవాత్మక మార్పులతో రాష్ట్రంలో సాధికారత సాధ్యమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయి. ఆయా వర్గాలు అభివృద్ధిలోకి వచ్చేందుకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం వంటి రంగాల్లో హద్దులు లేకుండా అవకాశాలు కల్పించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం బనగానపల్లెకు రానుంది.



బనగానపల్లె పెట్రోల్‌బంకు సెంటర్‌లో కళకళలాడుతున్న ఫ్లెక్సీలు

సాక్షి, నంద్యాల/కోవెలకుంట్ల: సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త నిర్వచనాన్ని చాటారు. నామినేటెడ్ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, పార్టీ పదవుల్లో.. ఇలా అన్నింటిలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారు. ఏ ఒక్క వర్గాన్ని చిన్న చూపు చూడకుండా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారు. 'బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలంతా నా మనుషులు' అంటూ ఆయా వర్గాలను సొంతం చేసుకున్నారు. నిన్నటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని వదిలేయగా వైఎస్సార్‌సీపీ మాత్రం ప్రభుత్వ పథకాలతో పాటు రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవుల్లో సింహభాగం కేటాయించారు. సామాజిక న్యాయంలో సీఎం వైఎస్ జగన్ పాటిస్తున్న దార్శనికతను దేశం మొత్తం ప్రశంసిస్తోంది. ఓ వైపు సామాజిక న్యాయం పాటిస్తూనే మరో వైపు నేరుగా అణగారిన వర్గాల కుటుంబీకుల్లో ఆర్థిక వెలుగులు నిండేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. గత టీడీపీ పాలన దోచుకోవడం, దాచుకోవడంలా సాగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఏ ఒక్కరూ పేదలుగా మిగిలిపోకూడదన్న లక్ష్యంతో సంక్షేమ ఫలాలు నేరుగా పారదర్శకంగా ఇంటికి చేర్చుతున్నారు. కేవలం బనగానపల్లె నియోజకవర్గంలోని ఈ వర్గాలకు ఈ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.940 కోట్ల మేర పంపిణీ చేశారు. పరోక్షంగా మరో రూ.243 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. అణగారిన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం బనగానపల్లెకు చేరుకోనుంది. ఈ యాత్రకు డిప్యూటీ సీఎంలు అంజాద్‌బాషా, నారాయణ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా ఏపీ ప్రభుత్వ సలహాదారుడు సినీనటుడు అలీ, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

బనగానపల్లె నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలు

	(డీబీటీ పద్ధతిలో)		పరోక్షంగా (నాన్ డీబీటీ)	
కులం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
బీసీ	1,83,197	409.30	73,868	148.91
ఎస్సీ	95,737	306.44	35,683	64.46
మైనార్టీ	78,431	201.43	7,598	11.22
ఎస్టీ	14,956	24.85	5,191	19.45

బస్సుయాత్రకు ఏర్పాట్లు పూర్తి

బనగానపల్లె: పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో బుధవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. సభ జరుగే ప్రాంతంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సీఎం వైఎస్ జగన్, ఇతర నాయకులతో ఉన్న ఫొటోలతో ఫ్లెక్సీలు భారీగా వెలిశాయి. పట్టణంలోని మరికొన్ని ప్రాంతాల్లోను ఫ్లెక్సీలు కళకళలాడుతున్నాయి. కార్యక్రమం విజయవంతం కావాలని నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి పిలుపునిచ్చారు.బస్సు యాత్ర కార్యక్రమంలో విజయవంత చేసేందుకు ఉత్సాహంతో ఉన్నారు.



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సభ సాగుతుంది ఇలా..

నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేరుకోనున్న నేపథ్యంలో పట్టణంలో ఆయా కుల సంఘాలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉదయం 11.30 గంటలకు స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే సమావేశానికి హాజరయ్యే మంత్రులు, ప్రజాప్రతినిధులు మధ్యాహ్నం 1 గంటకు ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు. భోజన విరామం తర్వాత 3 గంటలకు ఫంక్షన్ హాల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. సాయంత్రం 4 గంటలకు పెట్రోల్ బంక్ కూడలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిరండి

బనగానపల్లె పట్టణంలోని బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్ర సభను ప్రజలు విజయవంతం చేయాలి. సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులంతా పెద్ద ఎత్తున తరలిరావాలి. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయా వర్గాలకు చేసిన మేలును నాయకులు వివరిస్తారు. నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొని సభకు తరలిరావాలి.

– కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్యే, బనగానపల్లె

ఎస్సీలకు ప్రత్యేక గుర్తింపు



ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించారు. గత ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాలను ఓటు బ్యాంక్‌గానే చూశాయి. ఎస్సీలంటే వెనుకబడిన కులాలు కాదని రాజకీయాలకు వెన్నుముక అని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల్లో సుముచిత స్థానం కల్పించిన ఘనత జగన్‌ది.

– కరుణాకర్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్

ముస్లింలకు ప్రాధాన్యత



సీఎం వైఎస్ జగన్ ముస్లింలను సోదరులుగా చూస్తున్నారు. సామాజిక న్యాయాన్ని నినాదంగా కాకుండా విధానంగా మార్చారు. కేబినెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. మంత్రి వర్గంలో 67 శాతం పదవులు వెనకబడిన తరగతులకే కేటాయించారు. మా కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, డైరెక్టర్‌గా నాకు అవకాశం కల్పించారు.

– అబ్దుల్‌ఖైర్ షేక్, ముస్లిం కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్

బీసీలకు సముచిత స్థానం



గత టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరిగింది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేశారు. సంక్షేమ పథకాల నుంచి పదవుల వరకు మహిళలకు పెద్దపీట వేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోంది. పైసా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తోన్న ఏకైక ప్రభుత్వం ఇదే.

– శ్యామలదేవి, కుర్ని కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్

మత్స్యకారులకు ఆర్థిక భరోసా

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(సెంట్రల్): మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు, కార్మికులకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఓఎన్‌జీసీ కార్యకలాపాలతో జీవనోపాధి కోల్పోయిన 23,458 మత్స్యకార కుటుంబాలకు నాలుగవ విడత ఆర్థిక సాయంగా రూ.161.86 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నగదు మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఏపీ బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జి.చంద్ర శేఖర్, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవ రెడ్డి, సహాయ సంచాలకులు సంధ్యారాణి, మత్స్యకార సొసైటీ సభ్యులు, ఆక్వా రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి, భద్రతకు భరోసా నివ్వడమే కాకుండా, మత్స్య రంగంలో నెలకొన్న సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. వెలుగోడు రిజర్వాయర్‌లో పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా సబ్సిడీ కింద 8.75 లక్షల విలువైన చేపపిల్లలు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో వివిధ పథకాల ద్వారా 60 శాతం సబ్సిడీతో అర్హులైన 15 మంది లబ్ధిదారులకు 75 వేల యూనిట్ విలువ ఉన్న టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలను అందజేశారు. అలాగే రూ. 50 లక్షల విలువైన ఫిష్ ఆంధ్ర ఆక్వా హబ్ యూనిట్‌కు 20 లక్షల సబ్సిడీ మంజూరు చేస్తూ లబ్ధిదారురాలు బి.రామలక్ష్మమ్మకు ప్రొసీడింగ్ పత్రాలు కలెక్టర్ అందజేశారు. జిల్లాలోని ఒక రిజర్వాయర్, 4 చెరువులలో మొత్తం రూ.6,35,880 విలువ గల చేపపిల్లల విడుదల చేయుటకు మత్స్యకార సంఘాలకు ప్రొసీడింగ్స్ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని మత్స్య సహకార సంఘాల సభ్యులు, ఫిష్ ఆంధ్ర లబ్ధిదారులు, మత్స్య అభివృద్ధి అధికారి పామన్న, వీఎఫ్ఏలు, ఎంపీఈఏలు తదితరులు పాల్గొన్నారు.



ఫిష్ ఆంధ్ర ఆక్వా హబ్ సబ్సిడీ లబ్ధిని అందిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

కరువును తరిమే కృష్ణమ్మ

- లక్కసాగరం ఎత్తిపోతల నుంచి కొచ్చెర్వు సర్‌పేస్ ట్యాంక్‌కు నీటి విడుదల
- సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఆనందోత్సవాల్లో 20 గ్రామాల రైతులు, ప్రజలు



జలకళ సంతరించుకున్న ఉడుములపాడుచెరువు



వంకలోకి నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

డోన్: కరువు నేల పులకించేలా.. పల్లెల దాహార్తి తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హంద్రీనీవా నీటితో చెరువులు నింపే కార్యక్రమం మరో మైలు రాయికి చేరింది. ఈ పథకం రెండో దశలో భాగంగా మంగళవారం కృష్ణగిరి మండలం లక్కసాగరం వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా కాల్వ నుంచి ప్యాపిలి మండలం పెద్ద పూజెర్ల, చిన్నపూజెర్ల, వెంగలాంపల్లె చెరువుల ద్వారా కొచ్చెర్వు సర్‌పేస్ ట్యాంక్‌ను నింపే కార్యక్రమాన్ని ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. దీంతో జిల్లాలోనే అతిపెద్ద సర్‌పేస్ ట్యాంకు అయిన కొచ్చెర్వు ట్యాంక్ మరో రెండు రోజుల్లో నిండు కుండలా మారనుంది. సుమారు 500 ఎకరాలకు పైగా విస్తీర్ణం, 172 ఎకరాల్లో 178 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న సర్‌పేస్ ట్యాంక్ నిండటంతో ప్యాపిలి, డోన్ మండలాల్లో 20 గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. సాగు నీటికి, తాగు నీటికి వేసవిలో సైతం ఎలాంటి ఇబ్బంది ఉండదని ఈ ప్రాంతం రైతులు, గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొచ్చెర్వు సర్‌పేస్ ట్యాంకు ద్వారా కృష్ణా జలాలు ఉడుములపాడు, జగదుర్తి, సూదేపల్లె, ఉలిందకొండ చెరువులకు చేరే అవకాశం ఉంది. దీంతో 3 వేల ఎకరాలు ఆయకట్టుగా మారనుంది. జిల్లాలో దాదాపు 68 చెరువులకు హంద్రీనీవా నీటిని మళ్లించే కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది అక్టోబర్ నెలలో మొదటి విడతగా లక్కసాగరం ఎత్తిపోతల పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. లక్కసాగరం నుంచి ఆలంకొండ చెరువును నింపి అక్కడి నుంచి యాపదిన్నె, వెంకటాపురం చెరువుకు నీటిని మళ్లించారు. వేల ఎకరాలకు సాగునీరు చేరడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు.

పూజలు చేసి.. హారతులు పట్టి..

హంద్రీనీవా నీరు కొచ్చెర్వు సర్‌పేస్ ట్యాంకుకు చేరే సందర్భంలో గ్రామస్తులు గంగమ్మ పూజ నిర్వహించారు. టెంకాయలు కొట్టి హారతులు సమర్పించారు. నీళ్లలో దిగి ఆనందం వ్యక్తం చేశారు. తమ భూములు ఇక బంగారు కానున్నాయని మురిసిపోయారు. కార్యక్రమంలో సర్పంచులు సూర్యచంద్రుడు, మాల మద్దయ్య, బాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మన్న, మదనగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పేరన్న, వెంకటేశ్వరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలతో పాటు పెద్దసంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇక సస్యశ్యామలం..



రెండేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో బోర్లలో నీరు ఎండిపోవడమే కాక పశువులకు కూడా తాగునీరు లభించని పరిస్థితి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక మంత్రి బుగ్గన చొరవతో త్వరలోనే ఈ ప్రాంతం పాడిపంటలతో సస్యశ్యామలం కానుంది. – ప్రతాప్‌రెడ్డి, రైతు, కొచ్చెర్వు

సీఎం, మంత్రికి రుణపడి ఉంటాం



గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాట ఇచ్చి నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఈ ప్రాంతం ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. మాట ఇస్తే తప్పక నెరవేరుస్తారనే నమ్మకం మరోసారి రుజువైంది.

– బీరప్ప, రైతు, కొచ్చెర్వు

బోర్లలో సమృద్ధిగా నీరు



కొచ్చెర్వు సర్‌పేస్ ట్యాంక్ హంద్రీనీవా నీటితో నింపడంతో 20 గ్రామాల్లోని బోర్లలో నీరు సమృద్ధిగా చేరి వేసవి కాలం కూడా పంటలు సాగుచేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ ట్యాంకులో నీరు చేరితే బోర్లలో గంగమ్మ ఉబికి వచ్చి తాగునీటి ఎద్దడికి కూడా అవకాశం ఉండదు. – బాలమ్మ, సర్పంచ్, గోసానిపల్లె

రైతుల కల సాకారం



జిల్లాలో సాగునీటి లేని సౌకర్యం లేని ప్రాంతం డోన్. ఈ నియోజకవర్గంలో 20 చెరువుల ను హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపి పాడి పంటలతో సస్యశ్యామ లం చేయడం ఆనందించదగ్గ విషయం. దశాబ్దాల రైతుల కల మంత్రి బుగ్గన, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో సాకారమైంది. – రేగటి రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ, డోన్

సంక్షేమ బావుటా



అందుకే జగన్ మళ్లీ రావాలి



ప్రతి నెలా ఒకటోతేదీ వస్తే చాలా వలంటీరు మా ఇంటి వద్ద వాలిపోయి అవ్వా పింఛన్ అంటూ.. డబ్బులిచ్చిపోతుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. మాలాంటి వృద్ధులకు ప్రతి నెలా పింఛన్ ఇచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యం మూట కట్టుకుంటున్నాడు. నేను గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నాను. ఎలాంటి పనులు చేయలేని స్థితి నాది. పింఛన్ డబ్బులు ఎంతో మేలు చేస్తున్నాయి. మందులు, ఖర్చులకు ఎవరినీ చేయి చాచాల్సిన అవసరం లేదు. పింఛన్ కోసం గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా నాలుగైదు రోజులు ఉంటే కానీ చేతికి వచ్చేది కాదు. కొత్త సంవత్సరం నుంచి రూ.3వేల పింఛన్ ఇస్తారని చెప్పారు. ఆరోగ్యం బాగోలేకపోతే మా ఊర్లో ప్రారంభించిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ఉంది. వెంటనే అక్కడికి వలంటీర్ సాయంతో వెళ్లి బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేయించుకుంటున్నాను. ఎలాంటి ఫీజు లేకుండా అన్నీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అందుకే మళ్లీ నా మనువడు జగనే గెలవాలి. మాలాంటోళ్లకు అండగా ఉంటారు.

– కమలమ్మ, క్రిష్టిపాడు, దొర్నిపాడు మండలం

పింఛన్ టెన్షన్ లేదు



జగనన్న పాలనలో పేదలకు ఎంతో మేలు జరుగుతోంది. సచివాలయాలు కట్టిన తర్వాత ప్రతి చిన్న పని కూడా ఊరిలో అయిపోతుంది. వలంటీర్లను ఏర్పాటు చేసి ఎంతో మంచి పని చేశారు. చదువు రాని వాళ్లు ఇతరులపై ఆధారపడకుండా వలంటీర్లు సాయంగా ఉంటున్నారు. నాకు పదేళ్లుగా వితంతు పింఛన్ వస్తోంది. గతంలో పింఛన్ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. పనులు మానుకుని పింఛన్ కోసం ఎదురు చూసేవాళ్లం. వేలి ముద్ర వేసేందుకు సిగ్నళ్లు అందక మరుసటి రోజు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీరు ప్రతి నెలా 1వ తేదీ పింఛన్ ఇస్తుండటం చాలా బాగుంది. రేషన్ బియ్యం కూడా ఇంటి వద్దకే వస్తున్నాయి. పేదలకు ఇల్లు, విద్య, వైద్యం ఇస్తున్నారు. జగనన్న పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారు.

– శివపురం శ్రీదేవి, లింగాల, పాములపాడు మండలం

పెయ్య దూడలే పుడతాయ్!

- పాడి రైతుకు ప్రభుత్వం భరోసా
- అందుబాటులోకి కృత్రిమ గర్భధారణ పద్ధతి
- రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఇంజెక్షన్ల సరఫరా
- జిల్లాకు 4 వేల డోసుల ఇంజెక్షన్లు మంజూరు

గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన గుర్రెడ్డి వ్యవసాయంతోపాటు పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్నాడు. 5 గేదెలు, ఒక ఆవు ఉన్నాయి. పశు వైద్యాధికారుల సూచనలు, సలహా మేరకు ఆవుకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ వేయించడంతో తొలిసారే ఆడ దూడ జన్మించింది. జననం అనంతరం ఆవు, దూడ ఆరోగ్యంగా ఉండటంతో ఆ కుటుంబానికి పాడి పరిశ్రమ నిర్వహణపై మరింత ధీమా పెరిగింది.



ఆరోగ్యంగా ఉన్న ఆవు, దూడ



గేదెకు గర్భధారణ ఇంజెక్షన్ వేస్తున్న వైద్యాధికారి

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్రప్రభుత్వం పాడి రైతులకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. వివిధ పథకాల ద్వారా పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో అమూల్ పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 'పాడి పశువులకు పెయ్యదూడలు పుట్టాలి.. రైతన్నకు లక్ష్మీకళ రావాలి' అన్న నినాదంతో తాజాగా కృత్రిమ పద్ధతిలో ఇంజెక్షన్ల ద్వారా పెయ్యదూడల (ఆడదూడలు) ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. రైతులకు పాడి, పంటలు రెండు కళ్లు. ఇవి ఒకదానిపై ఒకటి ఆధార పడి ఉండి రైతుల అభ్యున్నతికి దోహదపడుతున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 15 ప్రాంతీయ పశువైద్యశాలలు, 74 పశువైద్యశాలలు, 99 గ్రామీణ పశువైద్య కేంద్రాలు, 86 గోపాలమిత్ర కేంద్రాలు, 79 ఆర్‌బీకేలున్నాయి. జిల్లాలో 2.93 లక్షల నల్లజాతి పశువులు, 1.20 లక్షల తెల్లజాతి పశువులు ఉన్నాయి. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఆయా పశువైద్యశాలలకు ఇంజెక్షన్లు సరఫరా అవుతున్నాయి. గతంలో ఆవులు, గేదెలు చూడి కట్టాలంటే ఎద్దులు, దున్నలపై ఆధారపడాల్సి వచ్చేది. తర్వాత కృత్రిమ గర్భధారణ(సార్టెడ్‌సెమన్) ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి గేదెలు, ఆవులు గర్భందాల్చి ఏదో ఒక దూడకు జన్మనిస్తే చాలని పాడి రైతులు భావించేవారు. కాలానికనుగుణంగా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం సంతరించుకోవడంతో పాడి పరిశ్రమలో మగజాతి పశువులకు ప్రాధాన్యం తగ్గింది. దీంతో ప్రతి రైతు తమ ఇంట పెయ్యదూడలే పుడితే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని భావిస్తున్నారు. వారి ఆశలు నిజం చేసేందుకు ప్రభుత్వం పెయ్యదూడల జననానికి కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లను అందుబాటులోకి తెచ్చింది. పెయ్యదూడల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రత్యేకంగా గర్భధారణ ఇంజెక్షన్లు సరఫరా చేస్తుండటంతో ప్రతి రైతు ఇంట పెయ్యదూడల జననం సులభతరమైంది.

సబ్సిడీ ఇలా..

లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ సూది పూర్తి ధర రూ.1,350 ఉండగా ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తోంది. రైతులు రూ.500 భరించాల్సి ఉంది. మొదటి డోసుతో చూలు కట్టకపోతే రెండో సారి కూడా వేస్తారు. రెండు డోసులకు కలిసి ప్రభుత్వం ఈ ధరను నిర్ణయించింది. ఆవులు, గేదెలకు లింగనిర్ధారణ వీర్యంతో ఎదకు వచ్చినపుడు మాత్రమే సూది వేస్తారు. 21 రోజుల్లో మళ్లీ ఎదకు రాకపోతే చూలు కట్టినట్లే. రెండు డోసులు వేసినా పశువు చూలు కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500 వెనక్కి చెల్లిస్తారు. చూలు కట్టి మగ దూడ పుడితే రూ.250 వెనక్కి ఇస్తారు.

జిల్లాకు 4 వేల డోసులు

పెయ్యదూడల అభివృద్ధి పథకాన్ని పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సిబ్బంది రైతుల్లోకి తీసుకుపోతున్నాయి. లింగనిర్ధారిత వీర్యం ఉపయోగించడంతో రైతులకు అవసరమైన.. మేలైన పెయ్యదూడలను 95 శాతంపైగా కచ్చితత్వంతో పుట్టించడం ద్వారా పాల దిగుబడి పెరగనుంది. దీంతో రైతుల ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఏర్పడింది, అలాగే గ్రామాల్లో మేలు జాతి పశుసంపద వృద్ధి చెందనుంది. పాడి పశువుల కృత్రిమ గర్భధారణకు సంబంధించి జిల్లాకు 4 వేల డోసులు కేటాయించారు. ఇందులో కోవెలకుంట్ల ప్రాంతీయ పశువైద్యశాలకు 220 డోసులు, నంద్యాలకు 826, డోన్‌కు 40, నందికొట్కూరుకు 130, బేతంచెర్లకు 80. పాణ్యంకు 368, వెలుగోడుకు 300. జూపాడుబంగ్లాకు 30, చాగలమర్రికి 140, సంజామలకు 60, బనగానపల్లెకు 100, ఆళ్లగడ్డకు 360, రుద్రవరం ప్రాంతీయ పశువైద్యశాలకు 750 డోసులు కేటాయించారు. ఒక్కో ఏడీ కార్యాలయ పరిధిలో ప్రతి నెలా 100 డోసులు వినియోగించాల్సి ఉంది.

పాడి రైతులకు ప్రోత్సాహం



వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాను. పెయ్యదూడల జననానికి ప్రభుత్వం కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లను అందుబాటులోకి తెచ్చింది. పాడిపరిశ్రమ అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుండటం శుభపరిణామం. – బలరాముడు, రైతు, బిజనవేముల, కోవెలకుంట్ల మండలం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడిరైతులంతా పెయ్యదూడల జననానికి సంబంధించిన ఇంజెక్షన్లను ఎదకు వచ్చిన ఆవులు, గేదెలకు వేయించాలి. కోవెలకుంట్ల ప్రాంతీయ పశువైద్యశాలకు 220 డోసులు కేటాయించారు. పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – కృష్ణకుమార్, పశువైద్యాధికారి, కోవెలకుంట్ల

వ్యక్తి దుర్మరణం

ఆదోని అర్బన్: హాలహర్వి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలూరు మండలంకు రుకుంద గ్రామానికి చెందిన మాబు(35) దుర్మరణం చెందాడు. గూళ్యం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు.

సెంట్రల్ బృందం బెలుం గుహల సందర్శన



కొలిమిగుండ్ల: భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ సెక్రటేరియట్‌లో నూతనంగా నియమించబడిన కామన్ గ్రాడ్యుయేట్ లెవల్ సెక్షన్ ఆఫీసర్స్ (సీజీఎల్‌ఈ) టీం సభ్యులు మంగళవారం బెలుం గుహలను సందర్శించారు. 35 మందితో కూడిన టీం సభ్యులకు గుహల వద్ద ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్డీ శ్రీహరి, పంచాయితీ కార్యదర్శులు నరేష్, పర్వేజ్ స్వాగతం పలికారు. అనంతరం గుహ లోపలి భాగాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన కోటిలింగాలు, పాతాళగంగ, ఊడలమర్రి తదితర ప్రదేశాలను తిలకించారు. భారత్ దర్శన్‌లో భాగంగా దేశంలోని పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక ప్రాంతాల సందర్శిస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి

కర్నూలు సిటీ: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈఓ పి.వి. రమణ, దిశా మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో జిల్లా యువజన, సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, దిశా మొబైల్ యాప్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ బాధితుల్లో యువత, విద్యార్థులే అధికమని చెప్పారు. ఈ నేపథ్యంలో కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొందరు నిమిషాల్లో లోన్ ఇస్తామని నమ్మించి తర్వాత మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర వాటిలో ఫొటోలను అప్‌లోడ్ చేయకూడదని సీఐ కళా వెంకట రమణ విద్యార్థినులకు సూచించారు. ప్రతి ఒక్కరు తమ మొబైల్ ఫోన్‌లలో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

రగ్బీ విజేతలు కర్నూలు, అనంతపురం





రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న కర్నూలు బాలుర జట్టు, అనంతపురం బాలికల జట్టు

- గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసిన డీఈఓ డాక్టర్ రంగారెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి రగ్బీ అండర్ -17 స్కూల్‌గేమ్స్‌లో కర్నూలు,అనంతపురం జట్లు సత్తాచాటాయి.రెండు రోజులుగా నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు మంగళవారం ముగిశాయి.ఫైనల్ పోరులో బాలుర విభాగంలో నెల్లూరు జట్టుపై 17-10 స్కోర్‌తో కర్నూలు జట్టు విజయం సాధించింది. రెండు, మూడుస్థానాల్లో నెల్లూరు, ప్రకాశం జట్లు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై 5-0 స్కోర్‌తో అనంతపురం జట్టు గెలుపొందగా, రెండు, మూడు స్థానాల్లో నెల్లూరు, ప్రకాశం జట్లు నిలిచాయి. విజేత జట్లకు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. రంగారెడ్డి అభినందించి ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. గెలుపోటములు సహజమని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం పరిశీలకులు నాగలింగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు వ్యాయామ ఉపాధ్యాయులు ఎండీ బాష పాల్గొన్నారు.

మహానందిలో పాము కలకలం



మహానంది: మహానందిలోని నవ వినాయకుల విగ్రహాల ప్రాంగణంలో మంగళవారం రాత్రి ఓ పాము కలకలం రేపింది. విద్యుత్ బల్బులు ఆన్ చేసేందుకు వెళ్లిన ఎలక్ట్రీషియన్ శ్రీను, లక్ష్మయ్యలు పామును గుర్తించారు. వెంటనే వారు స్థానిక అయ్యన్న నగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. అనంతరం అక్కడికి చేరుకున్న మోహన్ పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు.

కేసీలో యువకుడి గల్లంతు



శివ (ఫైల్)

కర్నూలు : ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో గల్లంతయ్యాడు. మంగళవారం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కర్నూలు బుధవారపేటకు చెందిన హరిబాబు, లక్ష్మీ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుర్లు సంతానం కాగా ఇద్దరు ఆడపిల్లలకు వివాహమయ్యింది. తల్లి లక్ష్మీదేవి కిడ్నీ జబ్బుతో ఏడేళ్ల క్రితం మృతిచెందింది. తండ్రి హరిబాబు ప్లంబర్‌గా పనిచేస్తుండగా కుమారుడు శివ (26)గౌండా పని చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. అదే కాలనీకి చెందిన సుధాకర్, ప్రశాంత్‌తో కలిసి శివ మంగళవారం మధ్యాహ్నం వినాయక్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. అయ్యప్పస్వామి గుడి వద్ద ముగ్గురూ కలిసి నీటిలోకి దిగి సరదాగా కొద్దిసేపు ఈత కొట్టారు. అయ్యప్పస్వామి గుడి వైపు నుంచి అవతలి ఒడ్డుకు శివ ఈత కొట్టుకుంటూ వెళ్లి తిరిగి ఇవతలి గట్టుకు వచ్చే ప్రయత్నంలో నీళ్లలో మునిగిపోయాడు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో స్నేహితులు సుధాకర్, ప్రశాంత్ ఆ ప్రాంతంలో గాలించినా కనిపించలేదు. వెంటనే విషయం కుటుంబ సభ్యులకు చేరవేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని రెండు గంటల పాటు గాలించారు. దీంతో తండ్రి హరిబాబు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని కేసీ కెనాల్ వద్ద పోలీసుల చేత గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

ఓటరు జాబితా సవరణ ఫిర్యాదులను పరిష్కరించండి

- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశం

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను(ఫారం-6, 7, 8) త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో రీసర్వే, హౌసింగ్, ఓటరు జాబితా సవరణ, ఆడుదాం-ఆంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా జాబితాకు సంబంధించి డెమోగ్రాఫిక్, సిమిలర్, ఫొటోగ్రాఫిక్ ఎంట్రీస్‌కు సంబంధించి చెక్ లిస్టు జనరేట్‌లో పురోగతి లేదన్నారు. కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు మండలాలు అట్టడుగు స్థాయిలో ఉన్నాయన్నారు. రీసర్వేకు సంబంధించి 160 గ్రామాల్లో విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓ లాగిన్లలోని డేటా ఎంట్రీని 20లోపు పూర్తి చేయాలని చెప్పినా కేవలం 27 గ్రామాల్లో మాత్రమే పురోగతి కనిపించిందన్నారు. విలేజ్ సర్వేయర్, వీఆర్వో లాగిన్లలో డేటా ఎంట్రీకి సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్న అధికారులను కలెక్టరేట్‌కు పిలిపించి పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్యను ఆదేశించారు. అప్పుడు డిసెంబర్ 15 నాటికి ఫైనల్ ఆర్‌ఓఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలు ఉంటుందన్నారు. మరో రీసర్వేకు సంబంధించిన డేటా తహసీల్దార్ల లాగిన్లలోనూ ఎక్కువగా పెండింగ్‌లో ఉంటోందని, ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మిలకు సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి డిసెంబర్ 15వ తేదీ నాటికి జిల్లాలో 17 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. కొన్ని మండలాల్లో పురోగతి లేకపోవడంతో ఆయా మండలాల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడుదాం-ఆంధ్రకు సంబంధించి కిట్లను వారంలోపు సచివాలయాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓ రమణను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా స్థాయి మహిళ కబడ్డీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 24న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి కుబేర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సుతో నిమిత్తం లేకుండా 75 కిలోలలోపు బరువు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు గోనెగండ్ల మండలంలో నిర్వహించనున్న ఎం.పెద్ద రంగస్వామి మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారిణులు ఆధార్ కార్డుతో పోటీలకు హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 9989643383 సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో పోలీసుల సోదాలు



ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో టీవీ-9 ప్రజానగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయమే పెద్ద ఎత్తున పోలీసులు కాలనీకి చేరుకుని అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో విస్తృత సోదాలు చేపట్టారు. సరైన ధృవపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో డీఎస్పీ విజయశేఖర్ సమావేశమై మాట్లాడుతూ నాటుసారా తయారీదారులపై నిరంతర నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలు మానుకుని గౌరవ ప్రదమైన జీవితం గడపాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ట్రైనీ డీఎస్పీ భావన, తాలూకా సీఐ శ్రీరాం, దిశ పీఎస్ సీఐ కళా వెంకటరమణ, కర్నూలు రూరల్ తాలూకా సీఐ కిరణ్‌కుమార్ రెడ్డితో పాటు ఆరుగురు ఎస్‌ఐలు, 50 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన పురుగు మందులు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుభరోసా కేంద్రాల వారీగా రైతులకు పురుగు మందులు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. రైతులకు కచ్చితమైన ధరలకు నాణ్యమైన పురుగు మందులు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీకి దాదాపు అన్ని మండలాల్లో మన గ్రోమోర్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు సరఫరా చేస్తోంది. గతంలో ఆర్‌బీకేల ద్వారా పురుగు మందులు సరఫరా చేసేందుకు ఏపీ ఆగ్రోస్‌తో వ్యవసాయ శాఖ ఒప్పందం చేసుకుంది. అయితే అనుకున్న స్థాయిలో సరఫరా చేయలేకపోవడంతో ఆ బాధ్యతను ఏపీ సీడ్స్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీతో ఏపీ సీడ్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 మన గ్రోమోర్ సెంటర్లకు 15 కిలోమీటర్ల దూరంలోని ఆర్‌బీకేలను మ్యాపింగ్ చేయడం ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా 310 ఆర్‌బీకేలు మన గ్రోమోర్ సెంటర్లతో మ్యాపింగ్ అయ్యాయి. 25 రకాల ఆర్గానిక్ మందులు, 178 రకాల సూక్ష్మ పోషకాలు, 899 రకాల పురుగు మందులు అందుబాటులో ఉన్నట్లు వివరాలను ఆర్‌బీకేల్లో ఉంచారు. రైతులు ఆర్డర్ పెడితే నాలుగైదు గంటల్లోనే వీటిని సరఫరా చేస్తారని వ్యవసాయ అధికారులు తెలిపారు.